క్లుప్తంగా

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న నాగేశ్వర్ రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో శనివారం అంబలి పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉబేద్‌బిన్ యాహియా, భీమ్‌రావు, జావిద్, లబ్దుల్లా పాల్గొన్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామంలో క్రీడామైదానం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం రహపల్లి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. రైతు దినోత్సవం సందర్భంగా కలెక్టర్‌తోపాటు గ్రామానికి వచ్చిన అధికారులు అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనప్ప మంత్రి కావాలని యువకుడి యాత్ర



తిరుపతి దేవస్థానంలో సాయిరాం

కౌటాల: కోనేరు కోనప్ప వీరాభిమాని మండలంలోని ముత్తంపేట్ గ్రామానికి చెందిన సాయిరామ్ మరో యాత్ర చేపట్టారు. సీఎం కేసీఆర్ పీఎం కావాలని, మంత్రి కేటీఆర్ సీఎం కావాలని, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంత్రి కావాలని కోరుతూ 101 మందిరాల్లో దర్శనానికి శుక్రవారం బయల్దేరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాత్ర ప్రారంభించినట్లు సాయిరాం తెలిపారు. శనివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో దర్శనం పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

నార్నూర్: ఎంపల్లి తండాలోని శ్రీహనుమాన్ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం శ్రీహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి రాజేశ్ మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం రూ. 3లక్షలతో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని సర్పంచ్ రాథోడ్ గోవింద్ నాయక్‌ను ఆదేశించారు. గ్రామస్తులు ఐక్యతగా ఉండి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, కనక ప్రభాకర్, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభ విజయవంతం చేయండి

నార్నూర్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 6న నిర్వహించే ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు రేగుంట కేశవ్ మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో మాట్లాడారు. భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జిల్లెపల్లి నవీన్, మోరే శ్రీకాంత్, రాజ్‌పంగే శంకర్, మైలారం బాలాజీ పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ రాక

ఉట్నూర్‌రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈనెల 6న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న బహిరంగ సభకు హాజరవుతున్నట్లు మహాజన్ సోషలిస్ట్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కాంబ్లే బాలాజీ తెలిపారు. శనివారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాంప్రసాద్, అందారే బాలాజీ, శ్రీను మాదిగ, షేక్ బాబా పాల్గొన్నారు.

ఊరూరా రైతు సంబురం



వాంకిడి: నృత్యం చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

పెంచికల్‌పేట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి, కమ్మర్‌గాం రైతువేదికల్లో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామాల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రైతువేదికల వద్దకు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఏడీఏ రాజులనాయుడు, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, ఎస్సై విజయ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెలంగాణ రైతు దినోత్సవం ఉత్సవాలు మండల వ్యాప్తంగా ఏడు క్లస్టర్లలో అట్టహాసంగా నిర్వహించారు. వాంకిడి, ఖమాన, కనర్‌గాం, సోనాపూర్, బంబార, బెండార, ఇందాని క్లస్టర్‌లలో గల రైతువేదికల్లో విద్యార్థులు, యువకులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రైతులతో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ముండె విమల బాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: రైతుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. రైతు దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గిన్నెధరి, పంగిడిమాదర, మంగి, మాణిక్యపూర్, తిర్యాణి రైతువేదికల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, తహసీల్దార్ అనంతరాజు, ఎస్సై రమేశ్, మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది సంబరాల్లో భాగంగా శనివారం మండంలోని కెస్లాగూడ, అనార్‌పల్లి, సాంగ్వి, ఖైరీ, ధనోరా రైతువేదికల్లో రైతు దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను అలంకరించి ర్యాలీలు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ జమీర్, వ్యవసాయాధికారి గోపీకాంత్, ఏఈవోలు వెంకటేశ్, అఖిల్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జైనూర్‌లో..

కెరమెరి(జైనూర్): రైతును రాజు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవంలో భాగంగా జైనూర్ మండలం లేండిజాల రైతువేదికలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ఎడ్లబండ్లపై ర్యాలీలు నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. ఎంపీపీ తిరుపతి, ఏవో పవన్‌కుమార్, ఎంపీడీవో, తహసీల్దార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు ఉన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: రైతుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న అన్నారు. శనివారం రైతు దినోత్సవం సందర్భంగా మండలంలో రైతువేదికల్లో ఘనంగా రైతుదినోత్సవ వేడుకలు నిర్వహించారు. బూర్గుడ రైతు వేదికలో సర్పంచ్ మాధవి, ఎంపీవో ప్రసాద్, నాయకుల గోపాల్, వినోద్, జన్కాపూర్ రైతువేదికలో ఏఈవో ఖాదర్ హుస్సేన్, సర్పంచ్ లక్ష్మి, బాపురావు, చిర్రకుంట రైతువేదికలో సర్పంచ్ పార్వతి, భీమేశ్ రైతులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల రైతువేదికల్లో శనివారం తెలంగాణ రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లో రైతులు ఎడ్లబండ్లతో ర్యాలీ తీశారు. సమావేశంలో ఉత్తమ రైతులను సన్మానించి పంటల మద్దతు ధరల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్రా జగ్గాగౌడ్, ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, డీఆర్‌డీఓ సురేందర్, తహసీల్దార్ సాయన్న, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏవో రాజేశ్, వైస్‌ఎంపీపీ అమ్మక్క, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై రైతుల అసంతృప్తి

కౌటాల రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన రైతులు వ్యవసాయాధికారి రాజేశ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టాపాసు పుస్తకాలు ఉన్న రైతులే మాట్లాడాలని ఏవో పేర్కొనడంతో కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలో శనివారం రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతు వేదికల్లో గ్రామాల్లోని రైతులతో కలిసి ముచ్చటించి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండలంలో శనివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ రోజా రమణి, జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఏపీఎం మోహన్‌లాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అభిలాష్, ఏఈవోలు మీనా, రవితేజ, మారుతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: లేండిజాలలో మాట్లాడుతున్న కనక యాదవ్‌రావు



ఆసిఫాబాద్‌రూరల్: మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న



కౌటాల: ఎడ్లబండ్ల ర్యాలీ తీస్తున్న రైతులు



పెంచికల్‌పేట్: రైతులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



తిర్యాణి: రైతులను సన్మానిస్తున్న అధికారులు



కెరమెరి: ధనోరాలో నృత్యం చేస్తున్న మహిళలు

నేడు బుద్ధుడి విగ్రహావిష్కరణ



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సొంత నిధులతో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ ఆదివారం చేయనున్నారు. ఈసందర్భంగా విగ్రహ ఏర్పాటు పనులను శనివారం ఎమ్మెల్యే కోనప్ప పరిశీలించారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

కౌటాల: సిర్పూర్(టి) నాగమ్మ చెరువులో ఆదివారం గౌతమ బుద్ధుడి నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మహర్ కులస్తులు, బౌద్ధ మతస్తులు విజయవంతం చేయాలని బౌద్ధ మహాసభ సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ శనివారం తెలిపారు.

నేడు ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట జూన్ 4న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు కన్వీనర్లు వొజ్జల కిషోర్‌కుమార్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, మార్త సత్యనారాయణ, ముల్కల్ల సుభాష్, జయదేవ్ అబ్రహం తెలిపారు. ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని సమూలంగా నిర్మూలించాలి



మాట్లాడుతున్న స్వరూపారాణి

రెబ్బెన: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని సింగరేణి సేవా సమితి బెల్లంపల్లి ఏరియా అధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో నీటిపొదుపు, ప్లాస్టిక్ వినియోగం నష్టాలు, ఇంధన పొదుపు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు ప్రతీఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని, లేడిస్ క్లబ్ సభ్యులు ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. లలిత గుప్తా, ప్రసాదిని, పద్మస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

'బడిబాట'లో ఉపాధ్యాయులు



వాంకిడి: ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థినిని ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒడ్డెరవాడ పాఠశాలలో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు శనివారం గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న ఉచిత పోషకాహార భోజనం, రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు వంటి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన మొదటి విద్యార్థిని నికూరె అనూషను పూలతో సన్మానించి పాఠశాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాడె రాహుల్, చునార్‌కార్ మహేష్, సీఆర్పీ సందీప్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్‌పేట్, ఎంపీపీఎస్ సంజీవనగర్, పెంచికల్‌పేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పిల్ల లను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు యాదగిరి, అర్షియా సుల్తానా, ప్రియాంక, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రాజన్న, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ పాల్గొన్నారు.

కెరమెరి: బడిబాటలో భాగంగా శనివారం మండలంలోని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు, ప్రభుత్వ బడుల ప్రాధాన్యతను గ్రామ ప్రజలకు తెలియజేశారు. పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం కాంప్లెక్స్ హెచ్‌ఎం నల్లగొండ రమేశ్ పాల్గొన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతు అన్నారు. శనివారం మండలంలోని గుండాయిపేట్, కన్నెపల్లి గ్రామాల్లో బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మోర్లె రమేశ్, చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



కెరమెరి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

'ఎంపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి'



ఫిర్యాదు చేస్తున్న పాస్టర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: క్రైస్తవుల పట్ల ద్వేశంతో మాట్లాడిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ వ్యాఖ్యలపై నిరసన తెలుపుతూ శనివారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో ఏవో రఫత్‌కు ఫిర్యాదు చేశారు. సంఘం నాయకులు రాకేష్‌నాయక్, యేసుకుమార్, విల్ఫ్రెడ్, ప్రకాశం, లింగమూర్తి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్విజ్ పోటీలు

రెబ్బెన: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ సాంస్కృతి, కళలు, పర్యావరణం అంశాలపై ఉద్యోగులకు వేర్వేరుగా క్విజ్ పోటీలు నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 5న నిర్వహించనున్న పర్యావరణ దినోత్సవం వేడుకల్లో జీఎం దేవేందర్ బహుమతులు అందజేస్తారన్నారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, జూనియర్ ఎస్టేట్ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పాల్వాయి' యాత్ర



పాదయాత్రలో పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: పల్లెపల్లెకు పాల్వాయి –గడపగడపకు బీజేపీ పాదయాత్ర 25వ రోజు శనివారం మండలంలోని కన్నెపల్లి, బోదంపల్లి, శివాలింగపూర్, కౌటాల గ్రామాల్లో కొనసాగింది. పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ పాల్వాయి పురుషోత్తం రావు హయాంలో నియోజకవర్గంలోని పేదలకు ఎన్నో ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం శివాలింగపూర్‌లో పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఎంపీటీసీ దుర్గం మోతిరాం, నాయకులు కొంగ సత్యనారాయణ, బండి రాజేందర్‌గౌడ్, ఎల్ములే మల్లయ్య, బావుజీ, విజయ్, మధుకర్, చందు, ఉమా మహేష్, కవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రతం



వటసావిత్రి వ్రతాన్ని పురస్కరించుకుని కెరమెరి మండల కేంద్రంలోని ఆయా వాడలకు చెందిన మహిళా భక్తులు శనివారం శివాలయానికి తరలివచ్చారు. రావి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నవధాన్యాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్థానిక అర్చకుడు కులకర్ణి బాపూదేవ్‌రావి చెట్టు వద్ద ప్రత్యేకంగా కలశపూజ నిర్వహించారు. వటసావిత్రి వ్రతం ప్రాముఖ్యాన్ని కథల రూపంలో వివరించారు.

-కెరమెరి

తాగునీటి కోసం పడిగాపులు

- అందని మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందుల్లో నవేగాం గ్రామస్తులు



బోరింగు వద్ద నిరీక్షిస్తున్న గిరిజనులు

వాంకిడి: ఉగ్రరూపం చూపుతున్న భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాలు గుట్ట ప్రాంతాల్లో ఉండటంతో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. మండలంలోని నవేగాం(గడిమార్గ్) గ్రామ వాసులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. గ్రామం గుట్ట ప్రాంతంలో ఉండటంతో గ్రామంలో ఉన్న ఏకైక తాగునీటి బోరింగులో నీరు అడుగంటి పోయాయి. నీరు పంపులోకి రావడానికి ఎంతో కష్టపడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత కష్టపడ్డా కొంత నీరు మాత్రమే పంపు నుంచి వస్తుందని వాపోతున్నారు. ఎండాకాలం ప్రారంభానికి ముందు నుంచే గ్రామంలో భగీరథ నీరు రావడం లేదని, సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రాత్రిళ్లు గ్రామంలో ఉన్న ఏకైక బోరింగు వద్ద ఒక్క బిందెడు తాగు నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనీసం ఎండాకాలంలోనైనా మిషన్‌భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.